క్లుప్తంగా

రాయికల్‌లో 2,176 మంది పట్టభద్రులు

రాయికల్: పట్టణంతోపాటు మండలంలోని 32 గ్రామాల్లో 2,176 మంది పట్టభద్రులు, 66 మంది ఉపాధ్యాయులున్నారని తహసీల్దార్ ఖయ్యూం గురువారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ కేంద్రం, పట్టభద్రులకు మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈనెల 8 నుంచి జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముత్తయ్య తెలిపారు. 11వ తెలంగాణ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలకు గాను జిల్లాస్థాయిలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలు, యువతీయువకులకు రన్నింగ్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్, కిడ్స్ జావెలిన్ పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని వివరించారు.

యూరియా కొరత తీర్చండి


ఏఈవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కథలాపూర్: తాండ్ర్యాల గ్రామంలో యూరియా కొరత తీర్చాలని మాజీ వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, రైతు నాయకుడు చిన్నారెడ్డి ఏఈవో సుష్మకు గురువారం వినతిపత్రమిచ్చారు. యూరియా కొరతతో పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బందులపాలవుతున్నారన్నారు. పంటల సాగు వివరాలు సేకరించి సరిపడేలా యూరియాను సరఫరా చేయాలని కోరారు.

పెండింగ్ బిల్లులు మరిచిన ప్రభుత్వం


మాట్లాడుతున్న మాజీ సర్పంచులు

కోరుట్ల రూరల్: గ్రామాల్లో మాజీ సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయిందని మండల మాజీ సర్పంచులు అన్నారు. గురువారం మాట్లాడుతూ.. తమ పదవీకాలం ముగిసి ఏడాది గడుస్తున్నా తాము చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు మాత్రం ప్రభుత్వం విడుదల చేయటం లేదన్నారు. అంజయ్య, పిడుగు రాధ-సందయ్య, దమ్మ భీంరెడ్డి, దుంపాల నర్సు-రాజనర్సయ్య, రాజేందర్, చేప్యాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన విజయవంతంగా పూర్తి చేయటంపై కోరుట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్‌గౌడ్, పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్‌గౌడ్, కొంతం రాజం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

కోరుట్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఐసీటీసీ/సంపూర్ణ సురక్షా ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులు గురువారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 150 మంది మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, కోరుట్ల సూపరింటెండెంట్ సునీతరాణి, డాక్టర్లు వినోద్, శృతి, లయ, శివాని, ఐసీటీసీ కౌన్సిలర్ మల్లికార్జున్, మేనేజర్ సంతోష్, ఫార్మసిస్ట్ ప్రవళిక, ల్యాబ్ టెక్నీషియన్ సాజిద్ అలీ, శ్రీధర్, రమ్య, నాగరాజు, శంకర్, రాజేశ్, టీబీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి రక్తదానం

కథలాపూర్: సిరికొండ గ్రామానికి చెందిన తోపారపు నర్సయ్య అనే యువకుడు ఆపదలో ఉన్న మహిళకు గురువారం రక్తదానం చేశారు. సిరికొండ గ్రామానికి చెందిన ఎల్ల అరుణ అనారోగ్యానికి గురై చికిత్స కోసం కోరుట్లలోని న్యూ లైఫ్ ఆసుపత్రిలో చేరారు. ఆపరేషన్ కోసం ఓ పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు తెలపగా.. నర్సయ్య ఆసుపత్రికెళ్లి రక్తదానం చేశారు.

అసంపూర్తిగా అప్రోచ్ రోడ్డు పనులు

- సమీపిస్తున్న దుబ్బ రాజన్న జాతర
- ఆలోపైనా పనులు పూర్తయ్యేనా..
- ఇప్పటికే వంతెన పూర్తి

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బ రాజన్న జాతర బ్రహ్మోత్సవాలు ఈనెల చివరి వారంలో ప్రారంభం కానున్నాయి. భక్తులు వచ్చే దారిలో కోనాపూర్ వాగుపై హైలెవల్ వంతెన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. తాత్కాలికంగా వంతెనకు ఇరువైపులా మట్టి పోసి వాహనాలను పంపుతున్నా.. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ ప్రయాణికులతోపాటు మహా శివరాత్రి సందర్భంగా దుబ్బ రాజన్నను దర్శించుకోవడానికి వచ్చే లక్షలాది మంది భక్తులు ఈ వంతెన అసంపూర్తిగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.


కోనాపూర్ వద్ద అసంపూర్తిగా పనులు

కోనాపూర్ వద్ద హైలెవల్ వంతెన

జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల మీదుగా మంచిర్యాల జిల్లా వైపు వెళ్లే వాహనాలు జిల్లాకేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న కోనాపూర్ వంతెన మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోకి వచ్చే ఈ రహదారిపై కోనాపూర్ వాగుపై రెండున్నర సంవత్సరాల క్రితం రూ.5.65కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తయినా.. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. జగిత్యాల వైపు 150 మీటర్లు, సారంగాపూర్ వైపు 80 మీటర్ల అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. కోనాపూర్ వాగుపై గతంలో ఉన్న లోలెవల్ వంతెన తొలగించి హైలెవల్‌గా మార్చడంతో వంతెన ఎత్తు పెరిగింది. దీంతో అప్రోచ్ రోడ్ల నిర్మాణ సమయంలో ఎత్తు పెంచాల్సి ఉంటుంది. ఈ కారణంగా అక్కడ ఉన్న విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లను మరోచోటుకు మార్చాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ విషయంపై ఎన్‌పీడీసీఎల్ నుంచి ఆర్‌అండ్‌బీ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపింది.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



కోనాపూర్ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలి. హైలెవల్ వంతెన పూర్తయినా.. అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు చేపట్టక తాత్కాలికంగా మట్టి మీద వాహనలు వెళ్లడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పూర్తయి ఆరు నెలలు దాటింది. అప్రోచ్ రోడ్లు మాత్రం పూర్తి చేయడం లేదు. జాతర ఉత్సవాలకు వేలాది వాహనాలు వస్తుంటాయి.

– తేలు రాజు, పెంబట్ల

వాహనం వస్తే వెళ్లలేని పరిస్థితి



దుబ్బ రాజన్న జాతర బ్రహ్మోత్సవాలు, బీర్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారు. వేలాది వాహనాలు ఈ వంతెనపై నుంచి ఆలయాలకు చేరుకోవాలి. వంతెనకు ఇరువైపులా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్లపై ఎదురుగా మరో వాహనం వస్తే వెళ్లలేని పరిస్థితి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కాలగిరి మధుసూదన్‌రెడ్డి, సారంగాపూర్

సాంకేతిక కారణాలతో జాప్యం

కోనాపూర్ వంతెన నిర్మాణం పూర్తయింది. కొన్ని సాంకేతిక కారణాలతో పనుల్లో జాప్యం జరిగింది. ఈనెలలో పనులు చేపట్టి అప్రోచ్ రోడ్లు ఇరువైపులా పూర్తి చేస్తాం. వంతెనను అందుబాటులోకి తెస్తాం.

– రాజేందర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సారంగాపూర్


రాయికల్: శివాలయం వీధిలోని ఇళ్లలో గురువారం ఎస్సారెస్పీ నీరు చేరింది. రెండు రోజులు క్రితం నీరు విడుదల కావడంతో అయ్యప్ప ఆలయ సమీపంలో ఉన్న పైపులైన్ నుంచి నీరు వెళ్లక కాలనీలోని ఇళ్లలోకి వచ్చింది.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రోడ్డుపై నిలుపుతున్న ఆర్టీసీ బస్సులు



మల్యాల: జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై మల్యాల మండలం అడ్డరోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఒకేచోట ఆర్టీసీ బస్సులు నిలుపుతుండడంతో ఇటు వాహనదారులు, అటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్యాల అడ్డరోడ్డు వద్ద కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు బస్టాప్ వద్ద నిలపాల్సి ఉండగా.. రోడ్డుపైనే నిలుపుతున్నారు. కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు సైతం రోడ్డుపై నిలుపుతుండడంతో ప్రయాణికులు రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్నారు. బస్సులు రోడ్డుపై నిలుపుతుండడంతో బస్సులు వెళ్లేవరకు ఎదురుచూడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఆర్టీసీ బస్సులు ఒకవైపు బస్టాప్ సమీపంలో, మరోవైపు రోడ్డుకు దిగువన కొద్ది దూరంలో బస్సు నిలిపితే ఇటు వాహనదారులు, అటు ప్రయాణికుల సమస్య పరిష్కారమవుతుందని, ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీడీపీవో

జగిత్యాలరూరల్: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీడీపీవో మమత అన్నారు. గురువారం నర్సింగాపూర్, టీఆర్‌నగర్ గ్రామ సమీపంలోని ఇటుక బట్టీల్లో పని చేసే వారి గృహాలు, తాత్కాలిక నివాసమున్న లబ్ధిదారుల పిల్లలకు బాలామృతం, గుడ్లు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ టీచర్ రజిత పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



మెట్‌పల్లిరూరల్: పెద్దాపూర్ గురుకులంలో ఎన్డీఆర్‌ఎఫ్ బృందం గురువారం విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించింది. ప్రకృతి విపత్తులు, వరదలు, భూకంపాలు, తుపాన్ల లాంటి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. తక్షణ చర్యలు, సహాయ కార్యక్రమాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ మాధవీలత, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎస్సై ముకేశ్, ఆర్‌ఐ ఉమేశ్, కార్యదర్శి ఆసిఫ్, కారోబార్ రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ నులిపురుగుల మాత్రలు వేయాలి


అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు మౌనిక

మల్యాల: 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ నులిపురుగుల మాత్రలు వేయాలని మండల వైద్యురాలు మౌనిక అన్నారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమంపై మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది ఒక రోజు శిక్షణ నిర్వహించారు. సీడీపీవో వీరలక్ష్మి, ఎంఈవో జయసింహారావు, హెచ్‌ఈవో రమేశ్, పీహెచ్‌ఎన్ నాగలక్ష్మి, హెచ్‌వీ రమణమ్మ, శారద, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వెల్గటూర్: ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రల పంపిణీపై గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలస్థాయి టాస్క్‌ఫోర్స్ మీటింగ్ నిర్వహించారు. వెల్గటూర్, ఎండపల్లి వైద్యాధికారులు డా.లవకుమార్, డా.స్వరూప మాట్లాడుతూ.. వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలన్నారు. తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవోలు ప్రభాకర్, రాంచంద్రం, సీహెచ్‌వో జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లెక్చరర్లు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు 2025–26 అడ్మిషన్ల కోసం చిల్వాకోడూర్ పాఠశాలను సందర్శించారు. జూనియర్ కళాశాలలో ఉచిత పాఠ్య పుస్తకాలు, రూ.10,000 స్కాలర్‌షిప్, ఎంసెట్‌కు ఉచిత కోచింగ్ ఇస్తున్నామని పదోతరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో చదివిన విద్యార్థులు జేఎన్టీయూ కళాశాలలో సీట్లు పొందారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం, అధ్యాపకులు రాంప్రసాద్, సంతోష్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్: ఇటిక్యాల, ఒడ్డెలింగాపూర్, తాట్లావాయి, వీరాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ తుమ్మల నవీన్ గురువారం తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

సారంగాపూర్: బట్టపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కమిటీ అధ్యక్షుడిగా పూదూరి శోభన్ నియమితులయ్యారు. గురువారం గ్రామస్తులు సమావేశమయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అర్రై ప్రేమానందం, ఉపాధ్యక్షులుగా దాసరి ప్రసాద్, తిరుపెల్లి రాజయ్య, చుంచు రాజును ఎన్నుకున్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం

మల్లాపూర్: గ్రామంలోని ఆలయాల అభివృద్ధికి సహకారమందిస్తామని హైకోర్టు అడ్వకేట్ బైరినేని ప్రదీప్‌రావు అన్నారు. గురువారం రేగుంట పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో బైరినేని ప్రదీప్‌రావు-కవిత దంపతులను మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ, శ్రీఅభయాంజనేయస్వామి, శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి దివ్యమూర్తుల మకర తోరణాల ప్రతిష్ఠకు సొంత నిధులను అందించిన ప్రదీప్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తే గుర్తింపు

ఇబ్రహీంపట్నం: ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తే గుర్తింపు వస్తుందని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన ఫార్మసిస్ట్ ఉదయ్‌ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ ఉష, ఏఎన్‌ఎం లలిత, పదోన్నతిపై వెళ్లిన హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, మలేరియా అధికారి వెంకటేశం, హెల్త్ సూపర్‌వైజర్ మహేశ్వరిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. జిల్లా డిప్యూటీ వైద్యాధికారి శ్రీనివాస్, వైద్యాధికారులు అనిల్‌కుమార్, హరీశ్‌కుమార్, ఎన్‌హెచ్‌ఎండీపీవో రవీందర్, సీహెచ్‌వో రాంమోహన్ పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

రాయికల్: కొత్తపేట రాజరాజేశ్వరస్వామి నాగాలయంలో ఈనెల 8న కొబ్బరి కాయలు, లడ్డు, పులిహోర, తలనీలాలు, బెల్లం అమ్మేందుకు, కొబ్బరి ముక్కల సేకరణ కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వహణాధికారి విక్రమ్, అర్చకుడు రాజేశ్వరశర్మ గురువారం తెలిపారు.

జూ పార్క్ సందర్శన



కోరుట్ల: పట్టణంలోని పీఎంశ్రీ జిల్లాపరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని నెహ్రూ జూలోజికల్ పార్కును సందర్శించారు. జంతు ప్రదర్శనశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో క్లీన్‌లెస్ డ్రైవ్ నిర్వహించారు. ఏనుగుల సఫారీలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఎకో క్లబ్ బాధ్యులు చావ్ల లక్ష్మీనారాయణ, నాగరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారని హెచ్‌ఎం కృష్ణమోహన్‌రావు తెలిపారు.

శోభాయాత్ర



కథలాపూర్: చింతకుంట గ్రామంలో శ్రీసత్యానంద మహర్షి ఆశ్రమం స్వర్ణోత్సవాల శోభాయాత్ర గురువారం సాయంత్రం ప్రారంభమైంది. మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కథలాపూర్ నుంచి చింతకుంట వరకు శోభాయాత్ర నిర్వహించారు. మూడు రోజులపాటు ఉత్సవాలుంటాయని నిర్వాహకులు తెలిపారు. సత్యానంద ఆశ్రమాల పీఠాధిపతులు కమలానంద భారతిస్వామి, శ్రీహరి తీర్థస్వామి, విశోఖతీర్థస్వామి, మాతాజీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి సహకరించాలి


మాట్లాడుతున్న బద్దం అంజిరెడ్డి, డైరెక్టర్లు

మల్లాపూర్: సహకార సంఘాల బలోపేతానికి అధికారులు సహకరించాలని సిరిపూర్ ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి అన్నారు. గురువారం సిరిపూర్ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్లతో కలిసి పాల్గొన్నారు. బ్యాంక్ గ్యారంటీని చెల్లించలేదని సిరిపూర్ సహకార సంఘానికి నోటీసులివ్వకుండా సహకార నిబంధనలను తుంగలో తొక్కి డీసీవో పాలకవర్గాన్ని బర్తరఫ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం శోచనీయమన్నారు. సంఘం నిధులను దుర్వినియోగం చేస్తూ గత సీఈవో అవినీతికి సంబంధించి ఆయన భూములను సంఘాలకు అటాచ్ చేసి వేలం వేయగా.. ఆ భూములను సొంతం చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్ చేయాలని అన్నారు. దూలూరి సుధాకర్‌రెడ్డి, సంపతి లక్ష్మీనారాయణ, జక్కుల గంగరాజం, పెంట రవి, ఏనుగు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్ అప్పగించిన పోలీసులు



కోరుట్ల: పట్టణానికి చెందిన చింత చంద్రశేఖర్ అనే వ్యక్తి గురువారం తన బ్యాగును పోగొట్టుకోగా.. పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. చింత చంద్రశేఖర్ బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో బ్యాగ్ పడిపోయింది. అందులో తులం బంగారం, ఇతర సామగ్రి ఉంది. చంద్రశేఖర్ వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించారు. అప్పటికే మున్సిపల్ వాటర్ లైన్‌మెన్లు ఎండీ సలీం, శనిగారపు సురేశ్ దొరికిన బ్యాగును లతీఫ్ హోటల్‌లో అప్పగించారు. హోటల్ యజమాని బ్యాగును పోలీసులకు అప్పగించగా.. ఎస్సై శ్రీకాంత్ బ్యాగును చంద్రశేఖర్‌కు అందజేశారు.

ఒకరికి జైలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన ఆకుల రాధ తన కుమార్తెతో కలిసి గ్రామ శివారులోని తమ వ్యవసాయ భూమికి వెళ్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తి ఆకుల రాధ కుమార్తె మెడలో ఉన్న బంగారు గొలుసు చోరీకి యత్నించాడు. ఆమె కేకలు వేసి వెనక్కి జరగగా.. చేయికి గాయమైంది. ఆకుల రాధ ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పోచంపల్లి మహేశ్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. సాక్షులను గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా.. నేరం రుజువైంది. మహేశ్‌కు 3 నెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బాలిక అదృశ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని ఇందిరానగర్‌కు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలిక(17) అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం బాలిక తండ్రి కళాశాలలో దింపి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గీత తెలిపారు.

సంక్షిప్త వార్తలు

నీటి ఎద్దడి రాకుండా చూడండి

ధర్మపురి: రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గురువారం బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్మపురి పుణ్యక్షేత్రానికి వివిధ రాష్ట్రాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, ఏటా వేసవి కాలంలో భక్తులతోపాటు పట్టణ ప్రజలకు నీటి సమస్య తలెత్తుతోందన్నారు. గాజు భాస్కర్, ఆకుల శ్రీనివాస్, లవన్‌కుమార్, అప్పం శ్రీనివాస్ తదితరులున్నారు.

బీజేపీ అధ్యక్షులకు సన్మానం

మెట్‌పల్లి: కోరుట్ల నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు బీజేపీ అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు రమేశ్, మండల అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, కోరుట్ల మండల అధ్యక్షుడు విజయ్‌లను శాలువాతో సత్కరించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి శంకర్, నర్సింగరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల ఎమ్మెల్యే స్పష్టతివ్వాలి

సారంగాపూర్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఏ పార్టీలో ఉన్నారో జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు స్పష్టతివ్వాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా కప్పుకొని దేవుడి కండువా అని పేర్కొన్నారని తెలిపారు. గత నెలలో ఉమ్మడి జిల్లా సమావేశంలో ఓ ఎమ్మెల్యేతో తాను కాంగ్రెస్ అంటు బలంగా వాదించారని, ఆయన ఏ పార్టీలో ఉన్నారో అని జగిత్యాల నియోజకవర్గ ప్రజలు అయోమయంలో ఉన్నారన్నారు. విండో మాజీ చైర్మన్లు సాగి సత్యంరావు, మెరుగు రాజేశం, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల అధ్యక్షులు తేలు రాజు, నేరెల్ల సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

జగిత్యాలరూరల్: కొడిమ్యాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై మండల రెడ్డి సంఘం ప్రతినిధులు గురువారం ఫిర్యాదు చేశారు. చంద్రమోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ముత్యంరెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.